
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

3

సోమవారం 8 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 45.0
కనిష్టం : 26.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (సోమ)
సహరి : 4:31 (మంగళ)



చికెన్..పరుగు

కిలో రూ.280 నుంచి రూ.300

చికెన్ ధరలు ఆకాశాన్నంటాయి. ఎండలు మండుతున్న వేళ కోళ్ల పెంపకం తగ్గడంతో దీని ప్రభావం ధరలపై పడింది. దీంతో అమాంతం చికెన్ ధరలు పెరిగాయి. ఆదివారం చికెన్ ప్రియులకు ఈ ధరలు చుక్కలు చూపించాయి. గత వారం కిలో రూ.220 ఉండగా ఈవారం మరో రూ.80 పెరిగింది. కిలో రూ.300 వరకు విక్రయించారు. ఇదిలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున చికెన్ ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

- తాడేపల్లిగూడెం రూరల్

సన్‌డే

ఆదివారం ఎండ మండింది.. సూరీడు నిప్పులు చెరిగాడు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం అల్లాడారు.. బయటకు రావాలంటే భయపడి పోయారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి.



ఎండ నుంచి ఉపశమనం కోసం ద్వారకాతిరుమలలో పశువులకు జల్లు స్నానం చేయిస్తున్న సిబ్బంది

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ కోరారు. జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు తమ సహకారం అందించాలన్నారు. ఎన్ని కలకు సంబం ధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెస్సేజ్/ ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబరు 94910 41435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీనిని వినియోగించుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశా మన్నారు.

ఎంసీఎంసీ అనుమతి పొందాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించకుండా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. టీవీ చానల్స్‌లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల నిమిత్తం ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆమోదం పొందాలన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అభ్యర్థుల ప్రచార ప్రకటనలు పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమించామన్నారు. ఎంసీఎంసీ ఆమోదం పొందిన రాజకీయ ప్రకటనలను మాత్రమే ప్రసారం చేయాలన్నారు. ప్రకటనలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం కలెక్టరేట్ కింద భాగంలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేశారన్నారు. కరపత్రాలకు సంబంధించి ముద్రించే వివరాలను కమిటీకి తెలిపి ఆమోదం పొందాలన్నారు. ముద్రించిన కర పత్రాలపై తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ పేరు, ప్రతుల సంఖ్య ముద్రించి ఉండాలని లేకుంటే సంబంధిత ప్రింటర్స్‌కు నోటీసులు జారీ చేస్తామన్నారు.

రొయ్య రైతు విలవిల!



- దిగుబడులున్నా గిట్టుబాటు కాని వైనం
- 100 కౌంట్ పట్టినా రైతుకు నష్టమే
- రొయ్య ధరలపై పట్టని ప్రభుత్వం
- కొనుగోలుదారులదే రాజ్యం

మేత ధర పైపైకి రొయ్య ధర కిందకి..

నిడమర్రు ఏప్రిల్ 7 : ఆరుగాలం ఇల్లూవాకిలి వదిలి చెరువులు చుట్టూ తిరిగి పంట పండించిన రైతుకు నష్టమే మిగులుతోంది. గిట్టుబాటు ధరలేక నష్టాలతోనే సరుకు అమ్ముకుంటున్నాడు. ధరలు తగ్గించి పెట్టుబడి ఖర్చులు కూడా రాకుండా చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా రొయ్య పంటకు సరైన సమయం జనవరి పంట. సంక్రాంతి పండుగ తర్వాత వాతావరణంలో మంచు శాతం తగ్గి పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఈ వాతావరణం రొయ్య అనుకూలం కాబట్టి రొయ్య పంటను ఎక్కువగా వేస్తారు. వేసవి పంటలో రొయ్యల్లో ఎదుగుదల బాగా ఉంటుందని రైతులు భావిస్తుంటారు. ఎండ, ఉక్కపోతలను లెక్కచేయక పంట పండించినా చివరకు అమ్మే సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 100 కౌంట్ రూ.205, 90 కౌంట్ రూ.215, 80 కౌంట్ రూ.225, 70 కౌంట్ రూ.245, 60 కౌంట్ రూ.265, 50 కౌంట్ రూ.290 ధరలు పలుకుతున్నాయి.

మేత ధరలు చుక్కల్లో..

గత ఏడాదిగా రొయ్య సాగులో ప్రధాన పెట్టుబడి సరుకైన మేత ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గత సంవత్సరం టన్ను రొయ్య మేత ధర రూ.65 వేలు నుంచి రూ.75 వేలు ఉండగా నేడు రూ.90 వేల నుంచి రూ.95 వేలకు పెరగడంతో రైతులపై తీవ్ర భారం పడింది. టన్నుకు అదనంగా రూ.20 వేలు అదనపు భారం భరించాల్సి వస్తోంది. ఒకప్పుడు రొయ్య మేత షాపుల వాళ్ల అరువులు ఇచ్చి పంట పండాక జమ చేసే అవకాశం కల్పించేవారు. కాని నేడు ఆక్వా పరిశ్రమ పూర్తిగా దెబ్బతినడం వల్ల రైతులపై నమ్మకం సన్నగిల్లిన మేతల కంపెనీ ఏజెంట్లు , ఫీడ్ షాపువాళ్లు అరువులు ఇవ్వలేమని సొమ్ములు చెల్లిస్తేనే మేతలు అందించగలమని తేల్చి చెబుతున్నారు. దీంతో రైతులు తమ పంటను కాపాడు కోవడం కోసం అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని మేతలు కొనుగోలు చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

రొయ్యల ధరలు తగ్గి రైతు నాశనమవుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఆక్వా రైతుల సంక్షేమ సంఘం పేరుతో చర్చలు జరిపినా రొయ్యల కంపెనీలదే ఇష్టారాజ్యంగా మారింది. తమకు సరుకు అవసరమైతే ఒక పది రూపాయలు పెంచుతున్నారు. ఎంపెడా కానీ, ఆక్వా అథారిటీ గానీ రొయ్య తమను పట్టించుకోకపోవడం వల్లే ఈ తిప్పలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

100 కౌంట్ పట్టినా నష్టాలే..

రొయ్య రైతుల పరిభాషలో చెప్పాలంటే 100 కౌంట్ పడితే ఆ చెరువు సేఫ్‌లో ఉన్నట్లేనని గతంలో అంటుంటేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు.



ఒక రైతు తన చెరువులో 100 కౌంట్ రొయ్య పండించడానికి అయ్యే పెట్టుబడి వివరాలివి.. మేత 1.3 టన్నులు 1,20,000, మందులు రూ.30,000, లీజు (3 నెలలకు) 30,000, రొయ్య పిల్ల కొనుగోలు ఖర్చు రూ.35,000, రవాణా రూ.10,000, విద్యుత్ బిల్లులు (3 నెల లకు) రూ.15, 000, కూలీ ఖర్చు (3నెలలకు) రూ.15,000, ఇతరాలు రూ.10,000 ఖర్చు అవుతుంది. అంటే 100 కౌంట్ రొయ్య సాగు చేయడానికి రైతుకు అయ్యే పెట్టుబడి రూ.2,65,000. ఈ లెక్కన 100 కౌంట్‌కు ఒక టన్ను రొయ్య అమ్మితే ఇప్పుడున్న ధర ప్రకారం రూ.2,05,000 వస్తుంది. ఈ లెక్కన పెట్టుబడిలోనే సుమారు రూ.50 వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.75 లక్షల ఎకరాలు (జనవరి సాగు) ఉండగా దిగుబడులు 1,50,000 టన్నులు ఉంటుంది. ఇప్పుడున్న ధరల ప్రకారం తాము నష్టపోయే సొమ్ములు సుమారు రూ.7 కోట్లు ఉంటుందని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర లేదు..



రొయ్యల రైతు ఎన్నో ప్రయాసల కోర్చి పంట పండిస్తుంటే ప్రభుత్వం వారికి గిట్టుబాటు ధర కల్పించలేకపోతోంది. దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పెట్టుబడి సొమ్ములు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

- కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, ఆక్వా రైతు, గణపవరం

ఖర్చులు రావడం లేదు..



నేను క్రొవ్విడిలో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నా. ఎంతో కష్టపడి పంట పండించినా గిట్టుబాటు ధర మాట అటుంచి ఖర్చులు రావడం లేదు. 100 కౌంట్ రూ.205లకు అమ్మితే మాకు టన్ను రొయ్యకు సుమారు రూ.50 వేలుపై చిలుకు నష్టం వస్తోంది. ఈ ప్రభుత్వ హయాంలో రొయ్యలకు గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఖర్చులు రాకపోతే ఇక సాగు ఎలా చేయగలం.

- వాకమూడి ఇంద్రకుమార్, ఆక్వా రైతు, క్రొవ్విడి

రేషన్‌లో కోత

ఆందోళనలో కార్డుదారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 7: జిల్లాలో కార్డుదారులకు రేషన్ కోత విధిస్తున్నారు. ఏప్రిల్‌లోనే ఈ విధానం అమలు చేస్తుండటంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా ప్రతినెల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకుల కింద బియ్యంతో పాటు పంచదార అందజేస్తున్నారు. ఒక్కోనెల బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండిని పంపిణీ చేసేవారు. ఈనెల కోటాలో కందిపప్పు బదులుగా పంచదార ఒకటే సరఫరా చేస్తున్నారు. కార్డులో ఉన్న ఒక్కో సభ్యుడికి ఐదు కిలోల చొప్పున బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు ఇవ్వక పోవడంతో కార్డుదారులు మండిపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదని, నిత్యావసర సరుకుల్లో కోత విధించడం ఏమిటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర



- ఎవరైనా సరే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కోడ్‌కు లోబడి అందరూ నడుచుకోవాలి. కోడ్‌ను ఉల్లగించి ఇబ్బందులు పడొద్దు.
- ఎన్నికలకు సంబంధించి జంగారెడ్డిగూడెం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పరిధిలో జంగారెడ్డిగూడెం, లక్కవరం, తడికలపూడి, చింతలపూడి, ధర్మాజీగూడెం ప్రాంతాల్లో ఐదు పోలీస్ స్టేషన్లు ఉండగా అల్లిపల్లి, లింగగూడెం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం.
- చెక్ పోస్టుల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటుచేసి నిఘా పెట్టాం. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇతర పర్యవేక్షణ బృందాలతో నిరంతరం నిఘా ఉంచాం.
- సమస్యాత్మక పోలింగ్ సెంటర్ల వద్ద ప్రత్యేక బలగాలతో పర్యవేక్షిస్తున్నాం. కోడ్ అమలులోకి వచ్చినాటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.20 లక్షలు వాహనాల్లో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నాం. 300 లీటర్లు మద్యాన్ని సీజ్ చేశాం.
- కేంద్ర బలగాలు 100 మంది, లోకల్ సీఐలు, ఎస్ఐలు మొత్తం 150 మంది వరకు ఎన్నికల విధుల్లో ఉన్నారు. 700 మందిపై బైండోవర్ కేసులు పెట్టాం. రౌడీ షీటర్లపై నిఘా ఉంచాం.
- పర్మిషన్ లేకుండా డబ్బును తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నాం. ఎన్నికల విధులకు సంబంధించి ఎక్కడా సచివాలయం మహిళా పోలీస్‌లను బందోబస్తుకు ఉపయోగించడం లేదు.

- బుట్టాయగూడెం

ఆ సొమ్మెవరిది?

- కార్గో బస్సులో రూ.22.59 లక్షల నగదు తరలింపు
- జంగారెడ్డిగూడెంలో సీజ్ చేసిన ఎఫ్‌ఎస్‌టీ బృందం





ఆర్టీసీ కార్గో బస్సులో గుర్తించిన నగదును లెక్కిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 7 : ఎన్నికల కోడ్ కూసింది. ఎన్నికల నియమావళి ప్రకారం అధిక మొత్తంలో నగదు తరలింపు కష్టతరమైంది. దీంతో నగదు తరలింపులో వినూత్న మార్గాలను ఎంచుకుంటున్నారు. కానీ పోలీసులు డేగ కన్నుతో అవి పట్టుబడుతున్నాయి. సరైన బిల్లులు లేకపోతే సీజ్ చేస్తున్నారు. బిల్లులు లేని సొమ్ములు వ్యక్తిగతమా? లేక ఓటర్ల తాయిలాలకా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.
జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఒక దుకాణం వద్ద ఏపీ ఆర్టీసీకి చెందిన కార్గో బస్సులో నుంచి సామగ్రి పార్శిళ్లను దింపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఎఫ్ఎస్‌టీ బృందం, పోలీసు, రెవెన్యూ దాడి చేసి పార్శిళ్లను క్షుణ్ణంగా పరిశీలించడాన్ని చూసి ఆ ప్రాంత దుకాణదారులు, ప్రజలు ఒక్కసారిగా గందరగోళానికి గురయ్యారు. అయితే ఆ పార్శిళ్ల నుంచి నోట్ల కట్టలు బయట పడటంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. అధి కారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన కార్గో బస్సు సర్వీసులో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న బిల్లులు లేని రూ.22,59,500ల నగదును గుర్తించి అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో కేవీఆర్ అనే వ్యక్తి 507 ప్లాస్టిక్ బకెట్‌లు, ఇనుప సామగ్రి తదితర వస్తువులు ఐదు టన్నుల వరకు బుక్ చేసి ట్రాన్స్‌పోర్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. వీటిని జంగారెడ్డిగూడెంలో చంటి, రాజు, ప్రకాష్ అనే వ్యక్తులకు ఎల్ఆర్ బుక్ చేశారు. వీటిలో స్థానికంగా జీడిపప్పు వ్యాపారం చేస్తున్న ప్రకాష్ అనే వ్యక్తికి వచ్చిన 507 బకెట్‌లలో ఒక బకెట్‌లో ప్లాస్టిక్ గోనె సంచి, అట్టపెట్టెలో నగదును ప్యాక్ చేసి అనుమానం రాకుండా బకెట్‌లో ఉంచి పంపారు. అధికారులకు అందిన సమాచారంతో పట్టణంలోని గంగానమ్మ గుడి సెంటర్ రాజ్‌కో ఎలక్ట్రానిక్స్ వద్ద మిగిలిన సామగ్రి దింపుతున్న క్రమంలో అధికారుల బృందం దాడి చేసి నగదును గుర్తించి సీజ్ చేశారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పి.రాజేష్, ఎస్ఐ జ్యోతిబాస్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.స్లీవజోజి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌ఛార్జ్ కేవీ రమణ, హెచ్‌సీ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగరాజు, పవన్ కుమార్ కార్గో బస్సును తనిఖీ చేసిన వారిలో ఉన్నారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ స్లీవజోజి మాట్లాడుతూ సీజ్ చేసిన నగదును ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. నగదు విషయం జిల్లా ఎన్నికల ప్రధాన అధికారితో పాటు, ఇన్‌కమ్‌ట్యాక్స్ నోడల్ అధికారికి సమాచారం ఇచ్చామన్నారు. నగదు నిబంధనలు మేరకు ఉండి, సరైన పత్రాలను చూపిస్తే సంబంధిత వ్యక్తికి అందజేస్తామన్నారు. కాగా కార్గో రవాణా చేసే సమయంలో బస్సు డ్రైవర్లు సైతం ఎంసీసీ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసిన ఎన్నికల నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ పి.రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం సబ్ డివిజన్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాయన్నారు. దానిలో భాగంగా ఎస్ఎఫ్‌టీ బృందం జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి వద్ద ఏపీఎస్ఆర్టీసీ కార్గో వెహికల్‌ను తనిఖీ చేశామన్నారు ఎవరైనా నగదు, బహుమతులు వంటి వాటితో ప్రయాణం చేస్తే వారి వెంట ఆధారాలు ఉండాలన్నారు. నగదుకు సంబంధించి విచారణ జరుగుతుందని, ఎన్నికల నిబంధనలు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

డి.జి.టి వాహనాలు సరుకు రవాణాకే..

ఏలూరు రూరల్ : జంగారెడ్డిగూడెంలో నగదు స్వాధీనంపై ఏలూరు ప్రజా రవాణా శాఖ అధికారి ఎస్.వి.ఆర్ వరప్రసాద్ వివరణ ఇస్తూ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ నగదును స్వాధీనం చేసుకుని విచారణ చేస్తుందని తెలిపారు. కేవలం కార్గో రవాణా కోసమే డి.జి.టి వాహనాన్ని వాడతామని, సంబంధిత పార్శిళ్లు డి.జి.టి బుక్ చేసుకున్న వారికే సంబంధించినవిగానే పరిగణిస్తామని దీనిపై దర్యాప్తు జరుగుతున్నట్టు తెలిపారు.

తనిఖీల్లో 23.59 లక్షలు స్వాధీనం : ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 136.9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 64 వేల 900 రూపాయలు అని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు 23 లక్షల 59 వేల 500 రూపాయలు అని తెలిపారు.

లింగగూడెం చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష..

చింతలపూడి : చింతలపూడి మండలం రాష్ట్ర సరిహద్దు లింగగూడెం చెక్ పోస్టు వద్ద రూ.లక్ష నగదును ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఎస్.ఎస్ టీమ్ డిప్యూటీ తహసీల్దార్ సునీత ఈ నగదును పట్టుకున్నారని, సరైన ధ్రువీకరణ పత్రాలు చూపకపోవడంతో అధికారులకు సమాచారం ఇచ్చి నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.



ఉప్పుటేరు

ప్రశ్నార్థకంగా చేపల సాగు..!

- ఉప్పుటేరులోకి ముందస్తుగా ఉప్పునీరు రాక
- 'కొండంగి ఎత్తిపోతల' నుంచి నిలిచిన నీటి సరఫరా

కలిదిండి, ఏప్రిల్ 7 : ఉప్పుటేరులోకి ముందస్తుగా ఉప్పునీరు రావడంతో కొండంగి లాకుల వద్ద ఉప్పుటేరుపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేశారు. దీంతో చేపల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 23 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు, 3 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఉప్పుటేరుపైనే ఆధారపడి చేపల సాగు చేస్తున్నారు. గతంలో మే నెల వరకు ఉప్పునీరు వచ్చేది కాదు. ఈ ఏడాది దాళ్వా పంట లేకపోవడంతో కాల్వలను కట్టేయడంతో తీపి నీరు దిగక ఏప్రిల్ మొదటి వారంలోనే ముందస్తుగా ఉప్పునీరు వచ్చింది. దీంతో చేపల చెరువులను నీరు అందించే కొండంగి ఎత్తిపోతల 1, 2 పథకాలను నిలుపుదల చేశారు. చుట్టుపక్కల చెరువులకు నీరు తోడుకోవడానికి తీపి నీరు లేకపోవడంతో ఆక్వా రైతులు పలు అవస్థలు పడుతున్నారు. తీపి నీటిలో మాత్రమే తెల్ల చేపలు పెరుగుతాయి. ఉప్పునీరు తోడితే చెరువుల్లో చేపలకు కళ్లమండి చనిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో చేపల సాగు చేస్తున్న రైతులు ఉప్పునీరు ముందుగా రావడంతో చిన్న చేపలనే పట్టుబడి చేసి అయినకాడికి అమ్ముకుని నష్టాల పాలవుతున్నారు. కొంతమంది రైతులు చెరువులకు నీరు పెట్టకుండా ఖాళీగానే ఉంచుతున్నారు. చెరువులను ఎండగట్టి ఖాళీగా ఉంచినప్పటికీ వేలాది రూపాయల లీజు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొండంగి ఎత్తిపోతలపై సుమారు 20 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఉప్పుటేరులోకి సముద్రపు ఉప్పునీరు చొచ్చుకుని రావడంతో ఎత్తిపోతలను నిలుపుదల చేశారు. దీంతో చెరువులకు నీటి కొరత ఏర్పడింది. ఆగస్టు వరకు ఉప్పుటేరులోని నీరు చప్పబడే అవకాశం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆగిన ఎత్తిపోతల పథకం

భక్తుడిలా వచ్చి అమ్మవారి.. మంగళ సూత్రం కొట్టేశాడు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : ఏలూరు సమీపంలోని సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి భక్తుడిగా వచ్చి దండం పెట్టుకున్నాడు. ఆ పై అటు ఇటు చూసి అమ్మవారి మెడలో ఉన్న ఏడు కాసుల బంగారు మంగళసూత్రాన్ని అపహరించుకుపోయాడు. ఆ గుడి పూజారి తూటుకూరి నాగేశ్వరశర్మ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దొంగను ప్రాథమికంగా గుర్తించారు. అతనిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



అమ్మవారి మంగళసూత్రాన్ని అపహరించుకుపోతున్న దొంగ

• సోమేశ్వరునికి భస్మాభిషేకం

భీమవరంటౌన్, ఏప్రిల్ 7 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామికి శోభకృత నామ సంవత్సరం చివరి మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం భస్మాభిషేకం చేసి అలంకరించారు.



జాతీయస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు
ఏలూరు విద్యార్థిని ఎంపిక


రుత్వికతో స్కూలు హెచ్‌ఎం, కోచ్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 : పాండిచ్చేరిలో ఈనెల 9 నుంచి 15వరకు జరుగనున్న 38వ జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎ.రుత్విక ఎంపికైందని స్కూలు హెచ్‌ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈమె గతేడాది మేనెలలో పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో జరిగిన ఆరో రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని వివరించారు. బాలికకు తర్ఫీదునిచ్చిన కోచ్‌ను అభినందించారు.

11న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు


పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 7: అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్‌అకాడమి, ఎంకేపీజే చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన వట్లూరు సిద్ధార్థ బెస్ట్ పాఠశాలలో రాష్ట్రస్థాయి చదరం గం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఏజీసీపీ అకాడమి డైరెక్టర్ జి.యోహానంద్ తెలిపారు. ఆదివారం ఈ పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి ఆవిష్కరించారు. అండర్ -7, 9,11,13,15 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రచెస్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ రిఫరీగా పోశయ్య



పెంటపాడు, ఏప్రిల్ 7 : పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న ఎన్.పోశయ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ రిఫరీగా ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం నారపాటి రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసే పోశయ్యకు వాలీబాల్ అంటే చాలా ఇష్టమని, విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే వాలీబాల్‌లో కోచింగ్ ఇచ్చేవారన్నారు. 2022లో ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సర్వీసెస్‌లో ఆంధ్రరాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో టీవీ.రామకృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, వైస్ చైర్మన్ సుగుణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం


నందివాహనంపై ఉభయదేవేరులతో శివదేవుడు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, రాత్రి జరిగిన నంది వాహనంపై తిరువీధిసేవ భక్తులను అలరించింది. లోకకల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి నందివాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఏలూరులో టిల్లుస్క్వేర్ చిత్ర యూనిట్ సందడి


సమావేశంలో హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 7: 2022లో విడుదలై ఘన విజయం సాధించిన డీజే టిల్లు చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన చిత్రం టిల్లుస్క్వేర్.. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రానికి మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విడుదలై విజయవంతం కావడంతో చిత్ర యూనిట్ విజయయాత్ర చేపట్టింది. ఆదివారం ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్‌లో హీరో సిద్ధు జొన్నలగడ్డ సందడి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడుతూ మంచి సబ్జెక్ట్‌గా డీజే టిల్లు స్క్వేర్ చిత్రాన్ని రూపొందించగా, మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. మరో రెండు చిత్రాలు చేస్తున్నానని, ఈసారి ఆంధ్రా స్టైల్లో తన లాంగ్వేజ్ ఉంటుందన్నారు. దర్శకుడు మల్లిక్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రం ఇప్పటివరకు రూ.వంద కోట్లు వసూలు చేసిందని, ప్రేక్షకులతో సంతోషాన్ని పంచుకునేందుకే విజయయాత్ర చేపట్టామన్నారు. ఆదిత్య ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ ఎల్.వి.ఆర్ ఆకర్ష్ సినిమాస్ సూరనేని ఆకర్ష్, సూరనేని రాంబాబు, థియేటర్ మేనేజరు సుబ్రహ్మణ్యం, రిప్రజెంటివ్ దాసు తదితరులు పాల్గొన్నారు.

'భకాసుర' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనిట్ సభ్యులు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 7: తాన్విఆర్ట్స్ కల్పనా క్రియేషన్స్ బ్యానర్లో సంయుక్తంగా నిర్మిస్తున్న తాజాచిత్రం 'భకాసుర షేర్ శివన్ హీరోగా, పల్లవి హీరోయిన్‌గా, రవికిరణ్ శర్మ, బాబూరావు, అజయ్, కిషోర్, వెంకటేష్, నాగాశ్రీ, శ్రీకిరణ్, మీరా, శిరీష సత్య, రామాంజనేయులు, పీఎస్ రావు, రమణి, ఆయేషా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఏలూరులో ఆదివారం ఆవిష్కరించారు. డైరెక్టర్ శ్రీనివాస్ తమ్మిశెట్టి మాట్లాడుతూ దైవం, రాక్షసులు అనే విభిన్నమైన కథాంశంతో సస్పెన్స్ థ్రిల్లర్.. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈచిత్రం రూపొందించామన్నారు. ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని త్వరలో మిగతా షూటింగ్‌కి సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో హీరో శివ, నాగప్రసాద్, హీరోయిన్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.



సన్ డే
ఎండలు @ 46

క్రైకరం వద్ద నిర్మానుష్యంగా వున్న హైవే

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకీ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారంలో ఎండల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయానికి ప్రధాన పట్టణాల్లో ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.
– ఏలూరు సిటీ/పాలకొల్లు అర్బన్/ఉంగుటూరు

- ఏలూరు జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత
- తీవ్రంగా వడగాడ్పులు
- ఎండ వేడిమికి తట్టుకోలేక జనం విలవిల


పాలకొల్లులో రోడ్డు నిర్మానుష్యం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ఎండలు పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. ఆదివారం ఏలూరు జిల్లాలోని నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక రహదారులపై ప్రయాణాలను నిలిపివేసుకుంటున్నారు.

ఉక్కపోత, వడగాడ్పులు అధికం..

ఓ వైపు భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు ఉక్కపోత పెరిగింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. గాలిలో తేమ శాతం పెరగడంతో ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉక్కపోత విపరీతంగా పెరగడంతో జిల్లాలో ఏసీలు, కూలర్లు వినియోగం పెరగంతో అనూహ్యంగా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తే తలకి టోపీ ధరించి లేదా రుమాలు కట్టుకుని వెళ్లాలని సూచిస్తున్నారు. మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరినీరు తాగాలని ఏపీ విపత్తుల సంస్థ ఇప్పటికే మెస్సేజ్‌లతో హెచ్చరికలు జారీ చేసింది.

పెరిగిన ఉష్ణోగ్రతలు ఇలా..

ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా 46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతల వివరాలు ఇలా.. ఏలూరులో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీలు సెంటీగ్రేడ్ ఉండగా రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా ఉంది. నూజివీడు, చింతలపూడిలలో 46/24, జంగారెడ్డిగూడెంలో 46/23 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైనట్టు నెట్ సమాచారం ద్వారా తెలిసింది. ఇక భీమడోలు, పెదవేగి, ద్వారకాతిరుమల, నిడమర్రు, ఉంగుటూరు, కామవరపుకోట లింగపాలెం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లో 45/24 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శీతల పానీయాలకు డిమాండ్..

ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండటంతో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. జ్యూస్ షాపులు, కూల్ డ్రింక్స్ దుకాణాలు బిజీబిజీగా కనిపిస్తున్నాయి. కొబ్బరి బొండాల వినియోగం పెరిగింది. గోళీ షోడా, సుగంధి షోడా, బటర్‌మిల్క్, లస్సీ లను ఎక్కువగా సేవిస్తుండటంతో వాటికి డిమాండ్ కూడా పెరిగింది.

వడగాడ్పులకు వ్యవసాయ కూలీ మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఆగిరిపల్లి, ఏప్రిల్ 7: వడగాడ్పులకు ఆగిరిపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక వ్యవసాయ కూలీ మృతి చెందాడు. చొప్పర శ్రీనివాసరావు (45) ఆగిరిపల్లిలో గల ఒక వాహన షోరూం ఎదురుగా అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు అతనిని ఆగిరిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు.

చల్ల..చల్లగా..
షవర్ బాత్‌ల వద్ద సేదతీరుతున్న మూగజీవాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: సూర్యుడి తాపానికి చల్లదనం తోడైతే ఆ హాయి వేరుగా ఉంటుంది కదూ.. శ్రీవారి శేషాచలంపై ఎండలకు అటు భక్తులతో పాటు ఇటు దేవస్థానం సంరక్షణలో ఉన్న వందలాది మూగజీవులు సైతం అల్లాడుతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకునేలా శేషాచలంపై షవర్ బాత్‌ల వద్ద జలకాలాడుతూ ఆహా ఏమి హాయిలే ఇలా... అంటూ పూర్తిగా రిలాక్స్ అవుతున్నాయి. మూగజీవాలకు వడదెబ్బ తాకకుండా దేవస్థానం ఒక కార్యరూపం తీసుకొచ్చింది. శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో 320 వరకు పలు జాతుల ఆవులు. గిత్తలు, దూడలు ఉన్నాయి. ఆలయ గజలక్ష్మి(ఏనుగు), అశ్వాలను సైతం శ్రీవారి సేవలకుగాను పోషిస్తున్నారు. ఎండవేడిమి నుంచి వీటిని కాపాడేందుకు అవి నివసించే షెడ్లపైన రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీల నుంచి తెచ్చిన ఎలిఫేంట్ క్రీపర్ పాదులను పెంచి పోషిస్తున్నారు. షెడ్లలోపల భాగంలో కూల్ పెయింట్ వేసి, ఫ్యాన్‌లను ఏర్పాటుచేశారు. షవర్‌బాత్‌ల వద్ద ఆవులు, గుర్రాలు, గజలక్ష్మిలతో జల్లుస్నానం చేయిస్తున్నారు. ఖజానా బాతులకు రక్షణగా నీటి కొలనులను ఏర్పాటు చేశారు.




చల్లదనం కోసం షెడ్ పైకి ఎగబాకించిన పాదులు
షవర్ కింద జలకాలాడుతున్న గజలక్ష్మి(ఇన్‌సెట్‌లో) అశ్వం

పార్టీ అభ్యర్థుల్లో మార్పులు ఉండవు
- బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్థనాథ్ సింగ్

భీమవరం టౌన్, ఏప్రిల్ 7 :పార్టీ అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు ఉండవని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని మాజీ మంత్రి, బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. భీమవరం బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి జరగ లేదని, ప్యాచ్ వర్క్స్ కూడా చేయని దద్దమ్మ జగన్ ప్రభుత్వమని అన్నారు. బీజేపీ పాలనలో ఇప్పటికే వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర పేరుతో ఎంతోఅభివృద్ధి చేశామని, 22 లక్షల గృహాలు పేదలకు అందించామని, వీటికి జగన్ పేర్లు పెట్టుకోవడం దారుణమన్నారు. కేంద్రం తరపున చేసే పనులకు సీఎం జగన్ మ్యాచింగ్ గ్రాంట్‌లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి మార్పు అంటూ గందరగోళం సృష్టించవద్దని, ఇందులో ఎటువంటి మార్పులు లేవని తానే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. నరసాపురం పార్లమెంట్ రెండుసార్లు బీజేపీ విజయం సాధించిందని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి మూడో ఎంపీ అభ్యర్థిగా గెలుపు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి తపన చౌదరి, క్లస్టర్- కో ఇంచార్జి కోడూరి లక్ష్మీనారాయణ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ పెరిచర్ల సుభాష్‌రాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ వాహనాలను నిలుపుదల చేయడంతో మాట్లాడుతున్న రామరాజు

ర్యాలీని అడ్డుకున్న ఫ్లయింగ్, ఎంసీసీ టీమ్‌లు
- అధికారులతో మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు, ఏప్రిల్ 7: టీడీపీ ర్యాలీకి అనుమతులు లేవంటూ అధికారులు అడ్డుకున్నారు. ఆదివారం భీమవరం రూరల్ గ్రామమైన పెదఅమిరం నిర్మల ఫంక్షన్ హాలు నుంచి బయలుదేరిన భారీ ర్యాలీ ఆకివీడు మండలంలోని అయి-భీమవరం వరకు సజావుగా సాగింది. అయి-భీమవరం రోడ్‌లోని మినీ బైపాస్ రోడ్‌కు వచ్చే సరికి ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ అధికారులు ర్యాలీకి అనుమతులు లేవంటూ ముందు భాగంలో ఉన్న వాహనదారులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే రామరాజు అధికారులు దగ్గరకు వచ్చి అనుమతులు పెట్టామని తెలపారు. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ అధికారి ఎంపీడీవో వై.రామకృష్ణ, ఎస్ఐ బత్తిన నాగబాబును ప్రశ్నించగా ర్యాలీకి అనుమతులున్నాయని ఆర్వో నుంచి తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. స్థానిక ఎస్.టర్నింగ్ దగ్గర పార్టీ నాయకులు బొల్లా వెంకట్రావు, వేగేశ్న రామరాజు, పమ్ము, గొంట్లా గణపతి, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, మోపిదేవి సత్యవతి తదితరులు స్వాగతం పలికి ఎక్స్‌కవేటర్ ద్వారా గజమాల వేసి హారతులిచ్చారు. ర్యాలీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఉన్నారు.

క్రైం సమాచారం

వాహనం ఢీకొని యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం.. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స

పెదవేగి, ఏప్రిల్ 7 : లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. రాట్నాలకుంటకు చెందిన తాడేపల్లి సుధీర్, తోట సురేష్ శనివారం రాత్రి ముండూరులోని బంధువుల ఇంటికి వెళ్ళి, రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరిగి వస్తున్నారు. ఎంఆర్‌సీ కాలనీ దాటిన తరువాత జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనాలయమ్ ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తాడేపల్లి సుధీర్(23) అక్కడికక్కడే మృతి చెందగా, తోట సురేష్ తలకు తీవ్ర గాయం కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పూళ్ల కాల్వలో పడి ఒకరి మృతి

భీమడోలు, ఏప్రిల్ 7 :భీమడోలు మండలం పూళ్ళ గ్రామంలో ప్రమాదవశాత్తు ఏలూరు గోదావరి కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రంభా ఏసు(45) ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని గోదావరి కాల్వలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు భీమడోలు పోలీసులు అగ్నిమాపక అధికారులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఏసు మృతదేహాన్ని వెలికితీశారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 :ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గుర్తుతెలియని ఓ యువకుడు మృతి చెందాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు కల్గి, 5.5 అడుగుల ఎత్తు, సామాన్య దేహదారుఢ్యం, లేత పిస్తారంగు పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు కల్గి ఉన్నాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే హెచ్‌సీ 80740 55378కు సమాచారం అందించాలని కోరారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

పెదవేగి, ఏప్రిల్ 7 :పెదవేగి మండలం బాపిరాజుగూడెం పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన బాలిక నాలుగురోజులుగా కనిపించడంలేదని బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈనెల మూడో తేదీన సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్ళింది. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

రామసింగవరంలో సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: మండలంలోని రామసింగవరంలో 90 లీటర్ల నాటుసారా, 200లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నట్లు ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


నాగిరెడ్డిగూడెంలో నాటు సారా సామగ్రితో అధికారులు

సారా తయారీ కేంద్రంపై దాడి
- 3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.. 50 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, ఏప్రిల్ 7:చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడి జరిపారు. సారాకు తయారీకి ఉపయోగించే 3,600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. సారా బట్టీవద్ద వున్న 50 లీటర్ల సారాను, సారా తయారీకి ఉపయోగించే పాత్రలు, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో చింతలపూడి సీఐ సుధాకర్, ఎస్ఐ కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత గొడవల నేపథ్యంలో ఒకరిపై కత్తితో దాడి


గాయాలైన కర్రి దుర్గారావు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాల కు గురయ్యాడు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన మున్సిపల్ వర్కర్ కర్రి దుర్గారావు, ఎలికే రాజుకు పాత గొడవలు ఉన్న నేపథ్యంలో రాజు, శ్రీలక్ష్మి అనే ఇద్దరు కలిసి కత్తితో దుర్గారావుపై ఆదివారం సాయంత్రం దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన దుర్గారావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

వివాహితను వేధిస్తున్నావని ప్రశ్నిస్తే.. దాడి చేశారు
- నలుగురికి తీవ్ర గాయాలు.. రంగంలోకి దిగిన పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : ఒక వివాహితను ఎందుకు వేధిస్తున్నారంటూ అడిగిన వారిపై ఒక వర్గం దాడిచేయడంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు సమీపంలోని వట్లూరు దగ్గరలో ఉన్న సీతారామ్‌పురంలో ఓ వివాహిత పొలం వెళుతుంటే అదే గ్రామానికి చెందిన నాగరాజు అసభ్యకరంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇదే విషయాన్ని ఆమె తమ కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆమె భర్త, బావ, మామ కలిసి ఆదివారం సాయంత్రం నాగరాజును ప్రశ్నించారు. పసుపులేటి రామకృష్ణ, ఏలూరుకు చెందిన మధు, మణికంఠ, నాగరాజు, దుర్గారావు, శ్రీహరి కలిసి ఆ వివాహిత కుటుంబంపై దాడికి పాల్పడగా నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒక మహిళ చేయి విరిగిపోయింది. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గడ్డివాము దగ్ధం

చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఆదివారం రైతులు పానుగంటి మంగయ్య, సత్యనారాయణకు చెందిన ఐదు ఎకరాల్లోని గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందగానే విస్సన్నపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్రామస్థులతో కలసి మంటలు అదుపు చేశారు. రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

స్కూళ్లను 11.30 గంటల వరకే నిర్వహించాలి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఎండల తీవ్రత, వడగాడ్పులు అధికంగా వున్న దృష్ట్యా పాఠశాలల పనివేళలను కుదించి ఉదయం 11.30 గంటల వరకే నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు పంపిన అభ్యర్థనల వివరాలను ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఒంటి పూట బడులను మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించి బాలబాలికలను ఇళ్లకు పంపిస్తున్నారని, ఈ క్రమంలో పిల్లలు ఇంటికి చేరుకునే సరికి ఒంటిగంట దాటుతోందన్నారు. ఈ సమయంలో విద్యార్థులు వడగాడ్పుల బారినపడే ప్రమాదం ఉందన్న విషయాన్ని ఉన్నతాధికారులు గ్రహించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1,2,3 తరగతులను కిలోమీటరు పరిధిలోని హైస్కూళ్ళలో విలీనం చేయడం వల్ల సంబంధిత పిల్లలు నివాసాలకు చేరుకోవడానికి అధిక ఉష్ణోగ్రతల బారిన పడుతున్నారని వివరించారు. బాలబాలికల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో వుంచుకుని పాఠశాలల పనివేళలను కుదించేలా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులు ఐక్యతగా హక్కులు సాధించుకోవాలి
- వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించాలి : సోమసుందర్


సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

ఆచంట, ఏప్రిల్ 7: జర్నలిస్టులందరూ ఐక్యతగా హక్కులను సాధించుకోవాలని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు దూసనపూడి సోమసుందర్ అన్నారు. ఆదివారం మార్టేరులో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సాయిబాబా, జక్కంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్‌లను ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ స్కీమ్ పునరుద్ధరించాలని దీనివల్ల జర్నలిస్టులు ప్రమాదాలకు గురైతే స్కీమ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జర్నలిస్టుల సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి కావాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేలా సంఘం తరపున పోరాడతామన్నారు. అనంతరం పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, జక్కంశెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్, రవిప్రసాద్, ముత్యాల శ్రీనివాస్, తులా నాగేశ్వరరావు, దిద్దే చిరంజీవి, నాని, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు మండలంలో
20 మంది వలంటీర్ల రాజీనామా


ఎంపీడీవోకు రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు

కైకలూరు, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నట్టు తెలిసింది. కైకలూరు మండలం పెంచికలమర్రు గ్రామానికి చెందిన పది మంది వలంటీర్లు, వేమవరప్పాడుకు చెందిన తొమ్మిది మంది, తామరకొల్లుకు చెందిన ఒక వలంటీరు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అందజేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లను రాజీనామా చేయాలని, మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, మీ ఉద్యోగాలకు తాము భద్రత కల్పిస్తామని హామీలిస్తున్నారని అయితే కొంతమంది వలంటీర్లు రాజీనామా చేసేందుకు సుముఖత చూపకపోవడంతో ఆయా సర్పంచ్‌లు వారిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. రాజీనామా చేయని వారిని మళ్లీ ప్రభుత్వం రాగానే ఉద్యోగాల నుంచి తీసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ఎన్నికల కమిషన్ ఈ రాజీనామాలపై దృష్టి పెట్టాలని పలువురు వలంటీర్లు కోరుతున్నారు.

రాష్ట్ర జట్టుకు నూజివీడు క్రీడాకారులు

నూజివీడు, ఏప్రిల్ 7: పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అండర్-16 విభాగం రాష్ట్ర జట్టుకు నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ క్రీడాకారులు ఎంపిక అయినట్లు వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడుకు చెందిన వాకా రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా అమల్‌రెడ్డి, నిరంజన్ ఎంపిక అయ్యారని, బాలికల జట్టుకు బి.ప్రభుదీపిక, బి.ప్రణవి, జి.మైథిలి ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు.

రైతు కుటుంబానికి రూ. 50 వేలు అందజేత

చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యుడు అలగలపల్లి కృష్ణయ్య ఇటీవల మృతి చెందగా అతని కుటుంబీకులకు ఆదివారం కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, సంఘం అధ్యక్షుడు కొత్త రామారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సువర్చలా సమేత ఆంజనేయుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 7: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రంను పురస్కరించుకుని దేవస్థానం అర్చకులు, వేద పండితులు కలసి సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల అమ్మవార్లకు పట్టు వస్త్రాలు ఈవో ఆకుల కొండలరావు సమర్పించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి ఏప్రిల్ 7: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలిని నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు అనుసరించి భక్తులను అనుమతించామని, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

చెన్నకేశవుడికి చక్రస్నానం : ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామి వారికి చక్రస్నానం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 7: ద్వారకా తిరుమల దత్తత క్షేత్రమైన శనివారపుపేట చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈనెల 2 నుంచి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం బలిహరణ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పంచామృత స్నపన, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, రాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు అయ్యారు. ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు పర్యవేక్షించారు. ఆలయ మేనేజరు తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ సన్నిధిలో అన్న సమారాధన



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 7: పత్తేబాద గంగానమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద గత నెల 22నుంచి 24 వరకు జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు, అన్న సమారాధనలో పాల్గొన్నారు. కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర


ముత్యాలమ్మ జాతరలో గ్రామస్తులు

కుక్కునూరు, ఏప్రిల్ 7: కుక్కునూరు పంచాయతీ సంజయ్‌నగర్ కాలనీలో ముత్యాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ముత్యాలమ్మ గుడిలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మేళ తాళాలతో ప్రతి ఇంటికి వెళ్లగా భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మల్లెల చంటినాయుడు, వనమా వీరభద్రం, పరిటాల వెంకన్న, పరిటాల సతీష్, కర్నాటి కామేశ్వరరావు, కిట్టం వెంకన్న కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చల్లాలమ్మకు రెండు కిలోల వెండి కిరీటం


కిరీటం అందజేస్తున్న దాతలు

ఉంగుటూరు, ఏప్రిల్ 7: గ్రామ దేవత చల్లాలమ్మకు నారాయణ వెంకట ప్రసాదరావు, పద్మ నాగలక్ష్మీ దంపతులు రెండు కిలోల వెండి కిరీటాన్ని ఆదివారం అందించారు. దాతల పేరిట విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. మాజీ చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దొంతంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుష్ సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య సేవలు


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: పేదలకు ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరాలు ఎంతగానే ఉపయోగపడతాయని ఆయుష్ హాస్పిటల్స్ మేనేజర్ కాశీనాథ్ జాన్సి అన్నారు. ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నగరంలోని తూర్పు వీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబు దేవస్థానం ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బీపీ, సుగర్, ఈసీజీ, బీఎండీ, తదితర వైద్య పరీక్షలతో పాటు రోగనిర్ధారణ జరిగినవారికి ఉచితంగానే మందులను పంపిణీ చేశామన్నారు. మొత్తం 800 మందికిపైగా వైద్య సలహాలు పొందారని వివరించారు. కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, డయాలసిస్, రేడియాలజీ విభాగాల నుంచి వైద్యనిపుణులు పాల్గొన్నారన్నారు. వైద్యులు దశరథ్, సాయికృష్ణ, భానుకిరణ్, కవిత, యడ్లపాటి రాము పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'రాజు వేగేశ్న' స్కాలర్‌షిప్


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 7: రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆదివారం అందించారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అనంత కోటి రాజు 22 మంది విద్యార్థులకు రూ.1.56 లక్షల స్కాలర్‌షిప్‌లను అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు అధ్యక్షతన కలిదిండి జానకి రామరాజు, కనుమూరి అబ్బాయిరాజు విద్యార్థులకు అందించారు. నంబూరి రామచంద్ర రాజు, గొట్టుముక్కల భాస్కర్ రాజు, గోరంట్ల విజయరామరాజు, దండు ధనరాజు సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవన్‌లో ఆదివారం రైతు సంఘం సమావేశం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ వరికోతలు ప్రారంభమై 15రోజులైందన్నారు. ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు తెరవలేదన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయ్యాలన్నారు. ప్రభుత్వం కొనకపోవడంతో దళారులకు దాన్యం అమ్మి రైతులు నష్టపోతున్నారని అన్నారు. దీంతో 75కేజీల బస్తాకు రైతులు రూ.400 నష్టపోతున్నారన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.నరసింహ, సహాయ కార్యదర్శి భాస్కరరావు, పాల్గొన్నారు.

నిరుపేదలకు మానవత సహాయం

భీమడోలు, ఏప్రిల్ 7: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంఎం పురంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు నిరుపేదలకు ఆదివారం ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు, ఏప్రిల్ 7 : పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంతరం 6 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ వై.రాంబాబు తెలిపారు. మరమ్మతులు నిర్వహిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


లింగపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న సొంగా రోషన్‌కుమార్


జంగారెడ్డిగూడెంలో పథకాలు వివరిస్తున్న టీడీపీ నేతలు


కాకర్లమూడిలో సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

రాష్ట్రాన్ని దోచుకున్నారు

• వైసీపీ పాలనపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ధ్వజం • ఏలూరులో ఉమ్మడి సమావేశం • నేతల ప్రచారం


ఏలూరులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు, నేతల అభివాదం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 7: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ధ్వజమెత్తారు. ఏలూరులో ఆదివారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సమావేశంలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడారు. మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరులో స్థిర నివాసం ఏర్పరచుకుంటానని, అర్ధరాత్రి వచ్చినా సమస్యలు పరిష్కరిస్తా, ఏలూరును స్మార్ట్ సిటీగా తీర్చి దిద్దుతానన్నారు. చింతలపూడి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడం తన కల అన్నారు. జగన్ అడ్డగోలు సంపాదనతో ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. ప్రజలకు రోజుకు 90 పైసలు ఇచ్చి జగన్ రోజుకు రూ.90 కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నాడన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల భూములను కబ్జా చేయడానికి ప్లాన్ వేస్తున్నాడన్నారు. అసెంబ్లీ కూటమి అభ్యర్థి బడేటి చంటి మాట్లడుతూ రాష్ట్రంలో రాక్షస రాజ్యాన్ని కూల్చివేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ, ఉమ్మడి కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌డీ బలరామ్ దంపతులు, దాసరి ఆంజనేయులు, జనసేన నాయకులు రాఘవయ్య చౌదరి, కాశీ నరేష్, గౌరీశంకర్, బీజేపీ నాయకులు సుధాకర్ కృష్ణ, నాగం శివ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు బడేటి చంటిని ఘనంగా సన్మానించారు.

6, 20 డివిజన్స్‌లో నిర్వహించిన జయహో బీసీ సభలో చంటి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. శివప్రసాద్, కాశీనరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం : రోషన్

లింగపాలెం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ లింగపాలెంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. తమ కాలనీల్లో సరైన సౌకర్యాలు లేవంటూ పలువురు మహిళలు సమస్యలు విన్నవించారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజి సౌకర్యాలు లేవని, వర్షాకాలం వస్తే ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందని, సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున్‌రావు, తాతిన రాధా కృష్ణ, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, పిల్లల శ్రీనివాస్ యాదవ్, అసిలేటి అజయ్, గుత్తా సత్య సాయివరప్రసాద్, పి.మహేష్‌బాబు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వరవరప్రసాద్, రాయంకుల చక్రధరరావు, పాల్గొన్నారు.

అనంతరం బీసీ నాయకుల సమావేశంలో రోషన్‌కుమార్ మాట్లాడారు. బీసీలకు తెలుగుదేశంపార్టీ వెన్నంటి ఉంటుందన్నారు. సమావేశంలో తాళం సోంబాబు, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, విజయ్‌కుమార్, భారతి, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి

జంగారెడ్డిగూడెం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చింతలపూడి నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో ఆదివారం సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చింతలపూడి నియోజకవర్గ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌లను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మార్కండేయపురం, వెంకటదేవిపురం, బైపాస్ ఏరియా, గరుడ పక్షినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కొండేటి కిషోర్, గెడ సుబ్రహ్మణ్యం, బాబి, లక్ష్మణ్, మాణికల వెంకటేశ్వరరావు, లక్ష్మి, గద్దె జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : గన్ని

ఉంగుటూరు: రానున్న ఎన్నికలలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. సీతారాంపురంలో గన్నితో కలసి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం రాగానే పరిష్కారం చూపుతామన్నారు.

కాకర్లమూడి, తోట రామచంద్రపురంలో పత్సమట్ల ధర్మరాజు జనంలోకి జనసేన కార్యక్రమంను నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకర్లమూడి గ్రామానికి చెందిన అడ్వకేట్ తోట వీర వెంకట సత్యనారాయణ, జవ్వాది వెంకటేశ్వరరావు, యడ్లపల్లి మురళి, గుండుబోగుల బాలకృష్ణ, రిషిత తదితరులు జనసేనలో చేరారు. నిడమర్రు మండలం భువనపల్లి గ్రామస్థులు పార్టీలో చేరారు. కైకరం కొత్త బీసీ కాలనీలో చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. కైకరం సర్పంచ్ సలగాల గోపి, కృష్ణ మోహన్, కోనా ఆనంద్, బొందిలి నాగేంద్ర, యెగ్గిన శ్యామల, లింగంపల్లి మణికంఠ, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

● గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు మద్దతుగా ఆయన సోదరుడు భీమరాజు కోమర్రులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధర్మరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, యాళ్ళ సుబ్బారావు, భీమవరపు ఏసురాజు, బలుసు శ్రీనివాస్, తోట శ్రీనివాసరావు, చినరత్తయ్య, వడ్డి సుబ్బరాజు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే పోలవరం సాధ్యం : కరాటం

కొయ్యలగూడెం: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయం సాధిస్తేనే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కోరారు. మండలంలోని బయ్యన్నగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సస్యశ్యామలం కావాలంటే పోలవరం ప్రాజెక్టు పూర్తవ్వాలన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, పోలవరం జనసేన పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించుకోవాలని, మూడు పార్టీలు ఐక్యంతో విజయం సాధించాలని కోరారు. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, టీడీపీ నాయకులు మేఘలాదేవి, పారేపల్లి నరేష్, వీరస్వామి, జనసేన నాయకులు కరాటం సాయి, దుగ్గిన శ్రీను, రవికుమార్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు ప్రచారం నిర్వహించారు. నర్సన్నపాలెం, రామనుజపురం, వేదాంతపురం, ధర్మారావుపేట, సరిపల్లి, బయ్యన్నగూడెంలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కాపు నాయకులు

శనివారపుపేటలో కాపుల ఆత్మీయ సమావేశం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 7: కాపుల ఆత్మీయ సమావేశం ఆదివారం శనివారపేపేట వాసా వారి వీధిలో జరిగింది. కార్యక్రమానికి కాపు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీరాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాపులంతా ఐక్యంగా ఉంటే అన్ని మీవద్దకే వస్తాయన్నారు. క్రమ శిక్షణ పాటిస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, వాసా రాజు, నిమ్మల జ్యోతికుమార్, వీరంరెడ్డి రమేష్, మోహన్, పాలేటి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాలువపై కాలిబాట వంతెన నిలుపుదల

ఏలూరు రూరల్, ఏప్రిల్ 7: మల్కాపురం ఆశ్రం ఆసుపత్రి సమీపంలో ఇరిగేషన్ కాలువపై అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కాలిబాట వంతెన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని హైకోర్ట్ ఆదేశించింది. కాలువపై ఇరిగేషన్, అనుమతులు లేకుండా, కాలువ పారుదలకు ఆటంకంగా మారుతున్నదని, స్థానిక రైతులు, సామాజిక సేవ సంస్థలు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో న్యాయమూర్తి కాలిబాట వంతెన నిర్మాణం ఆపాలని ఆదేశాలు జారీ చేసినట్లు రైతులు తెలిపారు.

పలువురు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ

కుక్కునూరు, ఏప్రిల్ 7: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ముంపుకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులు పునరావాస పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల పలువురి ఖాతాల్లో పునరావాస పరిహారం జమ అయింది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని కుక్కునూరు గ్రామానికి చెందిన ముగ్గురు నిర్వాసితుల, కివ్వాక గ్రామానికి చెందిన ఇరువురికి, వేలేరుపాడు మండలంలో 13 మందికి పునరావాస పరిహారం జమ అయ్యినట్లు సమాచారం. గ్రామాల్లోని నిర్వాసితులందరికి పరిహారం జమ కాకుండా కేవలం ఇద్దరు, ముగ్గురికి మాత్రమే పరిహారం జమ చేయడంపై నిర్వాసితుల్లో గందరగోళం ఏర్పడింది. కేవలం రూ.3.50కోట్లు బడ్జెట్ విడుదలైన నేపథ్యంలోనే ఈ పరిహారం చెల్లించినట్లు తెలుస్తొంది.

టెన్త్ స్పాట్ టీచర్లకు మజ్జిగ పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: ఏలూరులోని పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో మూల్యాంకన విధులు నిర్వర్తిస్తున్న టీచర్లకు యూటీఎఫ్ జిల్లా శాఖ మజ్జిగ అందజేశారు. మజ్జిగ కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. యూటీఎఫ్ నాయకులు సుభాషిణి, నరసింహారావు తదితరులు మాట్లాడుతూ వేసవిలో స్పాట్ వాల్యూయేషన్ విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయుల సౌకర్యార్థం మజ్జిగను పంపిణీచేయడానికి కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ బుధవ్యాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫాఅలీ, కనకదుర్గ, రంగమోహన్, కమల్‌కుమార్, మోహన్‌రావు, రాంబాబు, రమణ, లక్ష్మణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనం అభివృద్ధికి చిహ్నం


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 7: గ్రంథపఠనం అభివృద్ధికి చిహ్నమని పెదవేగి లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానదాయక పుస్తకాలను చదివారు. గ్రంథ పఠనంతో లాభాలను అరుణ్‌కుమార్ వివరించారు. నిత్యం గ్రంథపఠనం చేస్తే వారి భవిష్యత్ అభివృద్ధి బాట పడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని ఆయన సూచించారు.

రేపు సామాజిక పంచాంగ శ్రవణం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: ఉగాది పురస్కరించుకుని యూటీఎఫ్ ఏలూరుజిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సామాజిక పంచాంగ శ్రవణం, రాజ్యాంగ శ్రవణం, రాజ్యాంగం-ఉగాది అంశాలపై కవితాగానం జరుగుతుందని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. హేలాపురి సింగర్స్ పాటలు, అభినయ నృత్య భారతి విద్యార్థుల నాట్యప్రదర్శనలు ఉంటాయన్నారు.

టీడీపీలో చేరిన ఆక్వా రైతులు, వ్యాపారులు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 7: రోజురోజుకు టీడీపీ బలోపేతం అవుతుంది. నియోజకవర్గంలోని బలమైన నాయకులు, ఎంఆర్‌డీ బలరామ్ దంపతులు వైసీపీ నుంచి టీడీపీలోకి చంద్రబాబు సమక్షంలో ఇటీవల చేరారు. ఆయన అనుచరులు ఆదివారం వందల సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలోని వ్యాపారస్థులు, ఆక్వారైతులు అధిక సంఖ్యలో చేరారు. బడేటి చంటి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నానిపై అసంతృప్తితో వైసీపీ నుంచి అందరూ టీడీపీలోకి వస్తున్నారని అన్నారు.

నాటు తుపాకీ కలిగి ఉన్న ఒకరి అరెస్టు

ముదినేపల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని ఈడేపల్లి గ్రామంలో ఆదివారం లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్న తమిళనాడుకు చెందిన వెంకటేషన్ శబరి నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట్ కుమార్ తెలిపారు. రొయ్యల చెరువుల వద్ద నాటు తుపాకీతో పిట్టలను తరిమేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయ హుండీ సొమ్ము చోరీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 7: నూజివీడు పట్టణంలోని పెద్దచెరువు వద్ద గల బాల భక్తాంజనేయస్వామి ఆలయ హుండీ సొమ్ము అపహరించారు. ఆదివారం ఉదయం స్వామివారికి పూజాదికాలు నిర్వహించేందుకు వచ్చిన స్థానికులు హుండీ పగులకొట్టి ఉండడాన్ని గుర్తించారు. నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. చాలాకాలంగా హుండీ నుంచి నగదు తీయలేదని, సుమారు లక్ష నగదు, కానుకలు ఉండవచ్చని చెబుతున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ముసునూరు, ఏప్రిల్ 7: రమణక్కపేటలో ఆదివారం కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. చింతలపూడి మండలం కొవ్వూరి గూడెంకు చెందిన కొవ్వూరి వెంకటేశ్వరరావు, ఎర్రంపల్లికి చెందిన తట్టికోళ్ళ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. ఒక కోడిపుంజు, 20 కోడికత్తులు, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు.


దాచారంలో సాయుధ బలగాల కవాతులో ఆర్వో సూర్యతేజ

దాచారంలో సాయుధ బలగాల కవాతు

కుక్కునూరు, ఏప్రిల్ 7: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సందేశాన్ని అందిస్తూ ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో దాచారం గ్రామంలో కవాతు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో కవాత్తు నిర్వహించారు. కాగా ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ తెలిపారు. దాచారంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీలు, ఇతరులు ఎవరైనా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అందరూ సివిజిల్ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు పరిశీలన

జీలుగుమిల్లి, ఏప్రిల్ 7 : ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అన్నారు. తాటియాకుల గూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఆదివారం పీవో పరిశీలించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి సామగ్రి తరలించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంఇకి సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ నిఖిల్, పోలీస్, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ప్రదర్శనలు




ఓటు వినియోగంపై సాంస్కృతిక ప్రదర్శన

ఉంగుటూరు, ఏప్రిల్ 7: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి ఓటర్లను చైతన్యం చేయడమే లక్ష్యంగా సాంస్కృతిక ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో కీర్తన కల్చరల్ సొసైటీ సభ్యులు ఆదివారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. మండలంలోని బొమ్మిడి, వెల్లమిల్లి, కైకరం తదితర గ్రామాలలో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంత్ బృందం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

లోవోల్టేజి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

జీలుగుమిల్లి, ఏప్రిల్ 7: లో వోల్టేజి సమస్యపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఏడీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతు పనులు చేశారు. రామన్నపాలెంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పూర్తి చేసి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. సిబ్బంది టి.వెంకటరత్నం, వి.జగన్ ఉన్నారు.


మోటారు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

మోటారు మరమ్మతు : తాగునీటికి తిప్పలు

ఉంగుటూరు,ఏప్రిల్ 7: కైకరంలో తరచూ మోటారు మరమ్మతుతో తాగు నీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతోంది. కొద్ది రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఉదయం తాగునీటి సరఫరా సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్వయంగా ఈవోపిఆర్‌డి షేక్ షంషుద్దీన్ ఆదివారం మోటారు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. తరచు విద్యుత్ సరఫరాలో ఆటంకం కలగడంపై గొల్లగూడెం ఏఈ దృష్టికి తీసుకువెళ్ళడంతో ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్కడక్కడా చలివేంద్రం..!

• ఎండలు తీవ్రం • గ్రామాల్లో గొంతెండుతోంది



పోలవరం బస్ షెల్టర్‌లో పంచాయతీ ఏర్పాటుచేసిన చలివేంద్రం

పోలవరం, ఏప్రిల్ 7: జాతీయ స్థాయి సాగు తాగునీటి ప్రాజెక్టు నిర్మాణమవుతున్న పోలవరంలోనే ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. ఎండల తీవ్రతకు నాలుక పిడచకట్టుకుపోయి తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తాగడానికి గుక్కెడు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అడుగడుగునా కనిపించే చలివేంద్రాలు ప్రస్తుతం అక్కడక్కడా మాత్రమే కనిపిస్తున్నాయి. వేసవి ఆరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే నడి వేసవిలో మరింత తీవ్ర సమస్య ఎదుర్కొనవలసిందే. స్థానికులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి తాగునీటి అవసరాలు తీర్చడానికి వేసవిలో చలివేంద్రాలే ప్రధాన ఆధారం. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవి. ఈ ఏడాది పోలవరం పంచాయతీ బస్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ అంతత మాత్రంగా ఉంది. రెవెన్యూ పోలీస్ శాఖలు మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసే చలివేంద్రాలు ప్రస్తుతం జాడ లేదు. ఎండలు మండి గొంతెండుతున్నా దాహం తీరే దారి లేక ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, కన్నాపురం అడ్డరోడ్డు, వింజరం, కచేరి జంక్షన్, ప్రగడపల్లి, రేపల్లెవాడ, ఇటుకలకోట, వింజరం, ఎల్ఎన్‌డిపేట గ్రామాల కూడళ్లలో గతంలో రెవెన్యూ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు మండలంలో ఎక్కడా రెవెన్యూ చలివేంద్రాల జాడలేక చేతిలో చిల్లర ఉంటే వాటర్ ప్యాకెట్ లేదా వాటర్ బాటిల్ కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. చిల్లర లేని వారు స్థానిక హోటళ్లలో గుక్కెడు నీరు ఇస్తే గొంతు తడుపుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు ఎండల తీవ్రతపై జాగ్రత్తలు చెబుతున్నారే తప్ప చలివేంద్రాల ఏర్పాటుతో వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు దాతలు స్పందించి మండలంలో చలివేంద్రాలు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బొర్రంపాలెంలో దాత చొరవ..

టి.నరసాపురం: బొర్రంపాలెంలో దాత బొమ్మగాని బాలకృష్ణ చొరవతో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. యువత సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ కె.విజయ్, కలపర్తి రామకృష్ణ, వీరరాఘవులు, చల్లా వెంకట్రావు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

20 మంది వలంటీర్ల రాజీనామా

- పలు గ్రామాల్లో సర్పంచ్‌ల ఒత్తిడి?
- అయినా రాజీనామాకు నిరాకరిస్తున్న వలంటీర్లు

కైకలూరు, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నట్టు తెలిసింది. కైకలూరు మండలం పెంచికలమర్రు గ్రామానికి చెందిన 10 మంది వలంటీర్లు, వేమవరప్పాడుకు చెందిన 9 మంది, తామరకొల్లుకు చెందిన ఒక వలంటీరు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అందజేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లను రాజీనామా చేయాలని, మరలా వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, మీ ఉద్యోగాలకు తాము భద్రత కల్పిస్తామని హామీలిస్తున్నారని, అయితే కొంతమంది వలంటీర్లు రాజీనామా చేసేందుకు సుముఖత చూపకపోవడంతో ఆయా సర్పంచ్‌లు వారిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసి మరలా ప్రభుత్వం రాగానే ఉద్యోగాల నుంచి తీసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. అయితే ఎన్నికలు అయ్యే వరకు రాజకీయాలతో ప్రమేయం లేకుండా తమ పని తాము చేసుకుంటామని బలవంతంగా రాజీనామా చేయిస్తే సహించమని తెగేసి చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఈ రాజీనామాలపై దృష్టి పెట్టాలని పలువురు వలంటీర్లు కోరుతున్నారు.

సన్ డే

- ఆదివారం ఎండకు జనం విలవిల
- పలుచోట్ల 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఆగిరిపల్లిలో వడగాడ్పులకు ఒకరి మృతి



జనసంచారం అంతగా లేక బోసిపోయిన కలిదిండి సెంటర్

ఏలూరు సిటీ/కలిదిండి/నూజివీడు, ఏప్రిల్ 7: ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఆదివారం ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారంలో ఎండల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయానికి ప్రధాన పట్టణాల్లో ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఆదివారం ఏలూరు జిల్లాలోని నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరడంతో ప్రజలు విలవిల్లాడారు. ఎండ తట్టుకోలేక ప్రయాణాలు మానుకున్నారు. ఓ వైపు భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు ఉక్కపోత పెరిగింది. వృద్ధులు, చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. గాలిలో తేమ శాతం పెరగడంతో ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉక్కపోత విపరీతంగా పెరగడంతో జిల్లాలో ఏసీలు, కూలర్లు వినియోగం పెరగంతో అనూహ్యంగా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తే తలకి టోపీ ధరించాలని సూచిస్తున్నారు. మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరినీరు తాగాలని ఏపీ విపత్తుల సంస్థ ఇప్పటికే మెస్సేజ్‌ల ద్వారా హెచ్చరికలు జారీ చేసింది.

వడగాడ్పులకు ఒకరి బలి



శ్రీనివాసరావు (ఫైల్)

ఆగిరిపల్లి, ఏప్రిల్ 7: వడగాడ్పులకు ఏలూరు జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక వ్యవసాయ కూలీ మృతి చెందాడు. చొప్పర శ్రీనివాసరావు (45) ఆగిరిపల్లిలో గల ఒక వాహన షోరూం ఎదురుగా అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు అత నిని ఆగిరిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు ఇలా..

ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా 46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతల వివరాలు ఇలా.. ఏలూరులో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీలు సెంటీగ్రేడ్ ఉండగా రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా ఉంది. నూజివీడు, చింతలపూడిలలో 46/24, జంగారెడ్డిగూడెంలో 46/23 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైనట్టు నెట్ సమాచారం.

స్మార్ట్ మీటర్లపై జగన్ బొమ్మ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, ఏప్రిల్ 7: కోడ్ ఉల్లంఘిస్తూ 'మీటర్లపై జగన్ బొమ్మ' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై నూజివీడు ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి వై.భవాని శంకరి స్పందించారు. రమణక్కపేట పరిధిలో బిగించిన స్మార్ట్ మీటర్లపై నవరత్నాల లోగోతో ఉన్న సీఎం జగన్ స్టిక్కర్‌ను తొలగించాలని ముసునూరు ట్రాన్స్‌కో ఏఈ ఆకుల హేమసుందర్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో రమణక్కపేట పరిధిలో బిగించిన సుమారు 170 వ్యవసాయ విద్యుత్ మీటర్లపై ఉన్న జగన్ స్టిక్కర్‌ను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిపై ఉన్న జగన్ స్టిక్కర్లను తొలిగించాలని ట్రాన్స్‌కో ఏఈకి ఆదేశాలు జారీ చేసినట్టు రిటర్నింగ్ అధికారి భవాని శంకరి తెలిపారు.



రాష్ట్ర జట్టుకు నూజివీడు క్రీడాకారులు

నూజివీడు, ఏప్రిల్ 7: పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అండర్-16 విభాగం రాష్ట్ర జట్టుకు నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ క్రీడాకారులు ఎంపిక అయినట్లు వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడుకు చెందిన వాకా రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా అమల్‌రెడ్డి, నిరంజన్ ఎంపిక అయ్యారని, బాలికల జట్టుకు బి.ప్రభుదీపిక, బి.ప్రణవి, జి.మైథిలి ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు.

రైతు కుటుంబానికి రూ. 50 వేలు అందజేత



చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యుడు అలగలపల్లి కృష్ణయ్య ఇటీవల మృతి చెందగా అతని కుటుంబీకులకు ఆదివారం కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, సంఘం అధ్యక్షుడు కొత్త రామారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

చాట్రాయి పాల సహకార సంఘం సభ్యులైన పాడి రైతులకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 1.37 లక్షల బోనస్‌ను ఆదివారం తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, సంఘం అధ్యక్షుడు కుప్పిరెడ్డి వసంతరెడ్డి పంపిణీ చేశారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి : డీఎస్పీ



ముసునూరు, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆదివారం రమణక్కపేటలో ఎన్నికల నియమావళిపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రజలు, రాజకీయ నాయకుల నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ పి.వాసు, ఏఎస్ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.



తండ్రి పార్థసారథిని గెలిపించాలని కుమారుడు నితిన్ కృష్ణ ప్రచారం



లోకుమూడిలో ప్రచారం నిర్వహిస్తున్న కామినేని



కలిదిండిలో ప్రచారం నిర్వహిస్తున్న కామినేని కుటుంబసభ్యులు

ప్రచార హోరు

కొలుసు తనయుడి ప్రచారం..

నూజివీడు టౌన్, ఏప్రిల్ 7: నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని గెలిపించాలని ఆయన తనయుడు కొలుసు నితిన్ కృష్ణ, నూజివీడు పట్టణం 1వ వార్డు ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ పాలనలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం వల్ల యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పడిన ఇబ్బందులను కాలనీవాసులకు వివరిస్తూ పరిస్థితి మారాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, ఎమ్మెల్యేగా తన తండ్రి పార్థసారథిని గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ కొంపెల్ల కృష్ణకుమారి, టీడీపీ నాయకురాలు సయ్యద్ నజీమ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: టీడీపీ విజయమే లక్ష్యంగా తెలుగుయువత అహర్నిశలు కృషి చేయాలని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తనయుడు కొలుసు నితిన్ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కొర్లకుంటలో జరిగిన మండల స్థాయి తెలుగుయువత సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో యువతకు ఉపాధి లేకుండా చేసి, వారి భవిష్యత్‌ను దెబ్బతీసిందని విమర్శించారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానన్న హామీని వైసీపీ తుంగలో తొక్కిందన్నారు. యువతను మోసగించిన వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌ను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు, నియోజకవర్గ కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి), బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మానురాజు సురేష్, నియోజకవర్గ కార్యనిర్వహణ కార్యదర్శి నక్కా యోహాను, యలమంచిలి శ్రీకాంత్, జనసేన నాయకుడు పాశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి : కామినేని

మండవల్లి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లోకుమూడిలో ప్రచారాన్ని నిర్వహించారు. పలువు రిని కలిసి తనకు కమలం గుర్తుపై ఓటు వేయాలని, ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి అట్టడుగున చేరిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, నాయకులు అట్లూరి భవానీప్రసాద్, సజ్జ బాబి, తలారీ రాజేష్, బూరుబోయిన శ్రీనివాసరావు, గడిదేశి విజయకుమార్, బోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కామినేని బంధువుల ప్రచారం..

పుట్లచెరువులో పార్టీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కామినేని బంధువులు కామినేని తులసి, కామినేని దీప ఇంటింటికి తిరుగుతూ అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఎస్సీ సెల్ నాయకులు పళ్లెం ఏడుకొండలు, పార్టీ గ్రామ అధ్యక్షుడు గన్ని నాగేశ్వరరావు, బీసీ నాయకులు ఉదుమురి జోగేశ్వరరావు, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో ఆదివారం కామినేని బంధువులు టీడీపీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌లకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, టీడీపీ నాయకులు బోయిన గోవింద్, భట్రాజు ఏసుబాబు, తట్టుగోళ్ల నాంచారయ్య, నున్న వెంకటేశ్వరరావు, బోడావుల రాము, గొరిపర్తి సత్తిబాబు, యలవర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బీసీలకు రక్షణ

కైకలూరు: చంద్రబాబుతోనే బీసీలకు రక్షణ అని టీడీపీ నాయకుడు బీకేఎం నాని అన్నారు. ఆదివారం ఆచవరంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుకు, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌ను సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తారని, వైసీపీలో అనేకమంది బీసీలు హత్యకు గుర య్యారని, బెదిరింపులు, బ్లాక్ మెయిల్స్, అక్రమకేసులతో బీసీలను అనగదొక్కా రన్నారు. బీసీలకు చంద్రబాబు అండగా ఉంటారని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, వరహాపట్నం మాజీ సర్పంచ్ బోయిన శ్రీనివాసరావు, మన్నె శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా రమేష్‌బాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధా, వేగిరెడ్డి సురేష్, తలారి చిన్న సీతారామయ్య, ఏకుల కిట్టయ్య, బోడావుల నాంచారయ్య, నాగనబోయిన నాంచారయ్య, మాడపాటి వీరయ్య, గంగుల నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి కృషి చేయాలి

ముదినేపల్లి/ముదినేపల్లి రూరల్: కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని టీడీపీ ముదినేపల్లి మండల నాయకుల సమావేశం నిర్ణయిం చింది. ఆదివారం ముదినేపల్లిలోని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్ మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎన్నికల ప్రచార కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. టీడీపీ నాయకులు కొత్తూరు విఠల్, లింగమనేని భాను ప్రసాద్, కోడూరు శేషుబాబు, పరసా విశ్వేశ్వరరావు, బొంగు రవికుమార్, వీరంకి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి రూరల్ మండలంలో ఆదివారం వినోద్ పలు గ్రామాల్లో పర్యటించి కూటమి అభ్యర్థుల గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కార్యకర్తలకు పలు సూచించారు.

ముదినేపల్లి: ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మారగాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మరీదు అర్జునరావు, వల్లభనేని గౌరీ శంకర్, పరసా రమేష్, పాతూరి వంశీ, అడుసుమిల్లి శివప్రసాద్, గొల్ల మోహనరావు తదితరులు ఆదివారం ముదినేపల్లి మండలం కాకరవాడలో ఇంటింటా ప్రచారం చేసి మేనిఫెస్టో అందజేశారు.

బెదిరింపులకు పాల్పడితే తిరుగుబాటే..



కామినేనిని సన్మానిస్తున్న మాల్యాద్రి, ఆర్యవైశ్య సంఘ నాయకులు

కైకలూరు, ఏప్రిల్ 7: అధికార బలంతో బెదిరింపులకు పాల్పడితే ప్రజలు తిరుగుబాటు చేస్తారని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరులో నియోజకవర్గ ఆర్యవైశ్య మిత్రుల ఆత్మీయ సమావేశాన్ని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆరవైశ్య సంఘ నాయకులు పెద్దఎత్తున బైక్ ర్యాలీగా సీఎన్నార్ గార్డెన్‌కు కామినేనిని తీసుకువెళ్లారు. నియోజకవర్గవ్యాప్తంగా ఆర్య వైశ్య వర్గీయులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ సమాజ హితం కోరే ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు కూడా తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కుటుంబపాలనతో కైకలూరు నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారన్నారు. ఇక మిగిలింది తిరుగుబాటేనని ప్రజలంతా ఐక్యతతో దుష్టపరిపాలనను పారదోలాలన్నారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకే రూ.730 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. అభివృద్ధి చేయలేక తనపై బురదజల్లే యత్నం చేస్తున్నారే తప్ప కైకలూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి లేదన్నారు. గతంలో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనన్నానని, అయితే రాష్ట్రంలోనూ, కైకలూరు నియోజకవర్గంలోనూ వైసీపీ నాయకుల ఆగడాలను చూసి తట్టుకోలేక పోయానని ప్రజల కోరిక మేర మరలా పోటీకి దిగానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండనని తనపై దుష్ప్రచారం చేశారని, నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి విమర్శలకు తగిన గుణపాఠం చెబుతానన్నారు. ప్రజలంతా ఎవరి వ్యాపారాలు వారు స్వేచ్ఛగా చేసుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఏలూరు టీడీపీ సీనియర్ నేత అంబికా కృష్ణ, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కైకలూరు ఆర్యవైశ్య సంఘ నాయకులు గుర్రం శ్యాంకుమార్, పైడిమర్రి రాధాకృష్ణ, సీనియర్ వెంకటేశ్వరరావు, కేకే బాబు, ఆర్యవైశ్య సంఘ యూత్ పెద్దఎత్తున పాల్గొన్నారు. టీడీపీ నేతలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, పెన్మెత్స త్రినాథరాజు, తాడినాడ బాబు, పోలవరపు లక్ష్మీరాణి, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ నిబంధనలు పాటించాలి

ముసునూరు, ఏప్రిల్ 7: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.శ్రీనివాసరావు కోరారు. ఆదివారం చెక్కపల్లి మెయిన్ సెంటర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వాహనాల్లో అక్రమ మద్యం, నగదు, ఇతర తాయిలాలు సైతం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు హెచ్చరించారు.

కార్యాలయ నిర్మాణానికి కామినేని భూమిపూజ



కైకలూరు, ఏప్రిల్ 7: నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉండేందుకు లోకు మూడిలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని కైకలూరు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లోకుమూడి రామాలయం పక్కన కూటమి కార్యాలయ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలకు అనువైన ప్రదేశంగా ఎంపిక చేసి కార్యాలయం నిర్మిస్తున్నామని, ప్రచారానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు కార్యాలయం నుంచే నిర్వహిస్తామన్నారు. మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు త్రినాథరాజు, టీడీపీ నాయకులు బీకేఎం నాని, గంగుల ఏసురాజు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, పూల రామాచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఆచవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



ముదినేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న కొడాలి వినోద్



కాకరవాడలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



కృష్ణను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

మాజీ ఎంపీపీ కందుల కృష్ణ కుమార్తె మృతి

చాట్రాయి, ఏప్రిల్ 7: మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు కందుల కృష్ణ చిన్న కుమార్తె జయ (21) శనివారం రాత్రి మృతి చెందటంతో చనుబండలో విషాదం నెలకొంది. ఆదివారం నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, తల్లాడ శ్రీనివాసరావు వివిద గ్రామాల నాయకులు జయ భౌతికకాయానికి నివాళులు అర్పించి, కందుల కృష్ణకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పార్టీ అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు ఉండవు

- బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్

భీమవరం టౌన్, ఏప్రిల్ 7 :పార్టీ అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు ఉండవని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని మాజీ మంత్రి, బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. భీమవరం బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి జరగ లేదని, ప్యాచ్ వర్క్స్ కూడా చేయని దద్దమ్మ జగన్ ప్రభుత్వమని అన్నారు. బీజేపీ పాలనలో ఇప్పటికే 22 లక్షల గృహాలు పేదలకు అందించామని, వీటికి జగన్ పేర్లు పెట్టుకోవడం దారుణమన్నారు.

వేమవరప్పాడులో కవాతు

కైకలూరు, ఏప్రిల్ 7: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎవరైనా బెదిరింపులకు, ప్రలోభాలకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు అన్నారు. ఆదివారం కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వేమవరప్పాడు, తామరకొల్లు, వింజరం గ్రామాల్లో కవాతు నిర్వహించి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బృందాలు పాల్గొన్నారు.

11న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 7: అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్‌అకాడమి, ఎంకేపీజే చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన వట్లూరు సిద్ధార్థ బెస్ట్ పాఠశాలలో రాష్ట్రస్థాయి చదరంగం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఏజీసీపీ అకాడమి డైరెక్టర్ జి.యోహానంద్ తెలిపారు. ఆదివారం ఈ పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి ఆవిష్కరించారు. అండర్-7, 9,11,13,15 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రచెస్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

నాటు తుపాకీ కలిగిన ఒకరి అరెస్టు



ముదినేపల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని ఈడేపల్లి గ్రామంలో ఆదివారం లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్న తమిళనాడుకు చెందిన వెంకటేషన్ శబరి అనే నిందితుడిని అరెస్టు చేసి తీసుకుని తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. రొయ్యల చెరువుల వద్ద నాటు తుపాకీతో పిట్టలను తరిమేందుకు ప్రయత్నిస్తుండగా నిందితుడివని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హుండీ సొమ్ము చోరీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 7: నూజివీడు పట్టణంలోని పెద్దచెరువు వద్ద గల బాల భక్తాంజనేయస్వామి ఆలయ హుండీ సొమ్ము చోరీ అయింది. ఆదివారం ఉదయం స్వామివారికి పూజాదికాలు నిర్వహించేందుకు వచ్చిన స్థానికులు హుండీ పగులకొట్టి ఉండటంతో నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. చాలా కాలంగా హుండీ నుంచి నగదు తీయలేదని, సుమారు లక్షవరకు నగదు, ఇతర కానుకలు ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ముసునూరు, ఏప్రిల్ 7: మండలంలోని రమణక్కపేటలో ఆదివారం కోడిపందేల శిబిరంపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. చింతలపూడి మండలం కొప్పూరిగూడెంకు చెందిన కొప్పూరి వెంకటేశ్వరరావు, ఎర్రంపల్లికి చెందిన తట్టికోళ్ళ శ్రీనును అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఒక కోడిపుంజు, 20 కోడికత్తులు, రూ. 2వేలు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఇతర కార్యక్రమాల పేరుతో కోడిపందేలు వేస్తే రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

పాత గొడవల నేపథ్యంలో ఒకరిపై కత్తితో దాడి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన మున్సిపల్ వర్కర్ కర్రి దుర్గారావు, ఎలికే రాజుకు పాత గొడవలు ఉన్న నేపథ్యంలో రాజు, శ్రీలక్ష్మి అనే ఇద్దరు కలిసి కత్తితో దుర్గారావుపై ఆదివారం సాయంత్రం దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన దుర్గారావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

గడ్డివాము దగ్ధం



చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఆదివారం రైతులు పానుగంటి మంగయ్య, సత్యనారాయణకు చెందిన 5 ఎకరాల్లోని గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందగానే విస్సన్నపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్రామస్థులతో కలసి మంటలు అదుపు చేశారు. రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు.

టీడీపీ నాయకుడు ధలరామ్‌కు మాతృ వియోగం

ముసునూరు, ఏప్రిల్ 7: టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ధలరామ్ మాతృమూర్తి సరోజనమ్మ (80) ఆదివారం ఉదయం మృతి చెందారు. నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథితో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు ముసునూరులోని ధలరామ్ ఇంటికి వెళ్లి సరోజనమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించి, దేవినేని కుటుంబానికి సానుభూతి తెలిపారు. చెక్కపల్లికి చెందిన కూచిపూడి రాధారుక్మిణి, కాట్రేనిపాడుకు చెందిన దేవరపల్లి వెంకటేశ్వరరావు భౌతిక కాయాలను సందర్శించి వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే గోపవరానికి చెందిన లోయ పాండు, గంజి వెంకటేశ్వరరావు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పార్థసారథి పరామర్శించారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.